# మనుషులు మనసులు

డాక్టర్. కె.వి.గోవిందరావు



తెల్లని ఆకాశం వంటి లెటర్ హెడ్ మీద, ముత్యాల్లాంటి చక్కని అక్షరాలు మెరిసే తారకల్లా ముచ్చట గొలిపి ఒక్క క్షణం ఆసక్తి కలిగించినా, ఆ అందమైన అక్షరాలన్నీ చేరి ముక్త కంఠంతో చేసిన విన్నపం బోధపడ్డాక ఆఫీసరు నొసలు చిట్లించాడు. జారుగా జారిన కళ్ళద్దాల నుంచి రెప్ప పైకెత్తి తన ఎదురుగా నిలుచున్న శ్రీధర్ వంక ఒక్క క్షణం చిత్రంగా చూసాడు. ఏమిటి ఈ విచిత్రమైన లేఖ అన్నట్టు.

శ్రీధర్ చూపులోనే ఆయన మనోభావాన్ని గ్రహించినట్లు "ఒక్క నెల రోజులు లీవు సార్" అని నసిగాడు, ఇంకా చెప్పదలుచుకున్నది ఉన్నట్లు చూస్తూ "అది తెలుస్తూనే ఉంది" ఆఫీసరు కొంచెం చిరాకుపడి అన్నాడు.

శ్రీధర్‌కి మెరపులా ఒక ఆలోచన స్ఫురించింది. లీవు లెటరులో ఉన్న విషయం ఆఫీసరుకు తెలుస్తూనే ఉంది. ఇక ఆయనకు తెలియవలసింది ఈ లీవుకు విపులమైన కారణాలే కదా. శ్రీధర్ చేతులు కట్టుకుని చెప్పుకుపోయాడు.

"సార్, తమ సహృదయత వల్ల యూనివర్శిటి ఎక్స్టెంషన్ లభించింది. బి.ఏ., పరీక్ష ఫీజు కట్టి పుస్తకాలన్నీ కొన్నాను. దయచేసి ఒక్క నెల లీవు మంజూరు చేయండి." ఈసారి ఆఫీసరు ముఖంలో వెలసిన మేఘం లాంటి కోపపు తెర తొలిగిపోయింది. నెరిసిన మీసంలో స్వార్థాన్ని సూచించే పెదవుల్లో అసహజమైన చిరునవ్వు కనిపించింది.

"శ్రీధర్ నీకేమైనా పిచ్చి పట్టిందా"

క్షణాల్లో ఆఫీసరు అనుగ్రహాన్ని పొందబోతున్నానని, పైపైకి ఉబికి వచ్చే జలపాతం లాంటి తన ఆశలను అనునయంతో దువ్వుకుంటున్న శ్రీధర్‌కు ఈ ప్రశ్న చిన్న షాక్‌లా వచ్చి తగిలింది. ఆలోచించడానికి అవకాశం లేని శ్రీధర్ 'అదేమి సార్' అన్నాడు.

"కాకపోతే మరేమిటి", పసి పిల్లవాణ్ణి మందలించినట్లు ఆఫీసరు అన్నాడు, "నేను పట్టభద్రుడనని నీకు తెలుసుగా?"

సందర్భం తెలుసుకున్న శ్రీధర్ ప్రయత్న పూర్వకంగానే ఆఫీసరును ఉబ్బించాలని అన్నాడు. "తెలియకేమండి. ఈ నాలుగేళ్ళ సర్వీసులోను మీ పేరు పక్క ఆ సువర్ణ అక్షరాలు కొన్ని వేలసార్లు వ్రాశాను చదివాను" మంచి లా పాయింట్ దొరికిన

వాడిలా ముఖం పెట్టి. ఆఫీసరు అన్నాడు : "నీ వంటున్న ఆ రెండు సువర్ణ అక్షరాల కోసం ఎంత సువర్ణం ఖర్చుపెట్టానో, ఎన్ని సంవత్సరాలు కష్టపడ్డానో, పాఠ్య గ్రంథాలు కాక ఎన్ని గైడ్సు చదివానో నీకు తెలుసా?"

ఈ ప్రశ్న శ్రీధర్‌లో కొంచెం సంచలనం కలిగించింది. ఒక వ్యక్తి అనుభవాన్ని, అనుభూతిని అందరికీ అన్ని సందర్భాలలోనూ పోల్చి చూపడం సమంజసం కాదు. తన 'ఆఫీసరు' ఆరు వేలు ఖర్చు పెట్టి ఐదు సంవత్సరాలకు గాని బి.ఏ. పట్టాన్ని పొందలేక పోయినంత మాత్రానా, ప్రతి ఒక్కడూ ఈ ప్రదక్షిణాలు చెయ్యందీ, అపజయాల్లో మునక వెయ్యంది విజయం పొందలేడనుకోవడం కేవలం సంకుచితత్వానికి ప్రత్యక్ష నిదర్శనమే.

శ్రీధర్ గొంతు సవరించుకుని "డిగ్రీ పరీక్షలో నెగ్గి రావడంలో మీరు చెప్పిన సాధక బాధకాలు లేకపోలేదు. కానీ ఏకాగ్రత, దీక్షతో ముందంజ వేసినప్పుడు ఎంత కఠినమైన పనినైనా సాధించవచ్చు సార్" అన్నాడు. ఆఫీసరు అహంభావాన్ని నొక్కినొక్కనట్లు.

"అపజయం పొందితేనో" అన్నాడు ఆఫీసరు వేటగాడు గురిచూసినట్లు శ్రీధర్ కళ్ళల్లోకి చూస్తూ.

శ్రీధర్ ఉత్సాహంగా మంద హాసం చేసాడు "ఆత్మ తృప్తి కలుగుతుంది సార్. సాధారణ మానవుడికి అసాధారణంగా కనిపించే పనిని శక్తి వంచన లేకుండా ప్రయత్నించిన అనుభూతి, అనుభవం మిగులుతాయి. మరొకసారి ప్రయత్నించడానికి రాళ్ళబాట చదును తేలుతుంది."

ఆఫీసర్ ఆత్మాభిమానం దెబ్బతిన్నది. అహం వహించింది. శ్రీధర్ వాదన తనకు నచ్చలేదు. ఈ యువకుడితో వాదించడం కన్నా, అధికార రీత్యా సంభాషణ ముగించడమే మేలనుకున్నాడు. శ్రీధర్ వంక నిశితంగా చూసి అన్నాడు "శ్రీధర్ నీవు ఆవేశంలో ఉన్నావు. అనుభవంతో చెప్పిన నా సలహా రుచించలేదు. ఏది ఎలా ఉన్నా ఆఫీసు ఇన్‌స్పెక్షన్ వస్తున్నది. నెలరోజులు నీకు లీవు ఇస్తే నాకు సబ్‌స్టిట్యూటు దొరకడు. ఐయామ్ సారీ!" లీవు లెటర్ శ్రీధర్ చేతికి అందించి 'ఆఫీసు ఫైల్స్‌లో మునిగిపోయాడు. తెంచి వేసినట్లు బదులు చెప్పిన ఆఫీసరు స్వభావం తెలుసుకున్న శ్రీధర్, పరధ్యాన్నంగా తన సెక్షనుకు తిరిగి వచ్చాడు. శ్రీధర్ ఆ రోజు తన సెక్షనులో ఏమీ పనిచేయలేకపోయాడు. అతని ఉత్సుకత స్తంభించింది. ఉత్సాహస్రవంతి తెగిపోయింది.

రాత్రి శ్రీధర్‌కు నిద్రలేదు. అంతర్యుద్ధం జరిగింది. మనసు ప్రశ్నల వర్షం కురిపించింది. అనుమానాలు రేపింది, భయపెట్టింది తనలో అంతకు ముందే ఆవరించుకుని ఉన్న ఆత్మ విశ్వాసం ఉప్పెనలా లేచి ఎక్కడ అలజడి నక్కడ అణచి వేసింది. తన ప్రయత్నంలో శ్రీధర్‌కు అసహజత ఏమీ కనిపించలేదు. తను ఒక వేళ అపజయం పొందినా, అది తనలో నిస్పృహ కలిగించగల పర్యవసానం కాదు. హృదయ పూర్వకంగా చేసిన పనిలో సాధించే విజయం వల్ల కలిగే తృప్తికన్నా, అపజయంలోని అనుభవం ఆశాజనకమైన భవిష్యత్తుకు శుభ సూచనలని శ్రీధర్ నమ్మకం.

తన ప్రయత్నాన్ని అధికారి నిర్లక్ష్యం చేసాడు. పిచ్చి యోచనని నవ్వి ఊరుకున్నాడు. తన మిత్రులు తన పథకం విని ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. అంత మాత్రాన తను నిరుత్సాహపడి విరమించుకోవాలా? అధికారి తన మీది కోపంతో, తను తిరిగి వచ్చాక అధికార రీత్యా కొన్ని ఇబ్బందులు కలిగించవచ్చు. తను ఎదుర్కోవడానికి సిద్ధమే. ముచ్చటైన గులాబీ మొన తేలిన ముళ్ళను తప్పించుకోగలిగిందా?

తెల్లవారేటప్పటికి శ్రీధర్ జటిల సమస్యను పరిష్కరించాడు. నెల రోజులు ప్రివిలేజ్ లీవుకు దరఖాస్తు వ్రాసి ఆఫీసుకు పంపి తను విజయవాడ ప్రయాణమయ్యాడు.

★ ★ ★

రైలులో కూర్చున్న క్షణం నుంచి శ్రీధర్ మేధస్సులో ఆలోచనలు ముసురుకున్నాయి. తీవ్రమైన ఆలోచనలలో నిండిపోయిన శ్రీధర్ మనస్సుకు ప్రయాణపు బడలిక కూడా తెలియలేదు.

విజయవాడ స్టేషన్‌లో దిగి సామాన్లు ప్లాట్ ఫారం మీద దింపించుకున్న శ్రీధర్‌కు సుడిగాలిలా ఒక ప్రశ్న వచ్చి ఎదుట నిలుచుంది, "విజయవాడలో ఎక్కడకు వెళ్ళాలి?" ఔను శ్రీధర్ ఈ విషయం ఆలోచించనే లేదు. తను హోటల్ గదుల్లో ఉండి ఖర్చు భరించలేడు. కనీసం నెలరోజులైనా ఉండాలి గనుక తనకు చౌక వసతి కావాలి. విద్యార్థుల వాతావరణం కూడా కావాలి. అను క్షణం ఎదురు వచ్చే సమస్యలను పరిష్కరించుకోలేక దిగజారిపోయే కన్నా, విజయవాడ తనకు పరిచయమున్న టౌనే గనుక సామాను క్లాక్ రూంలో వేసి వెయిటింగ్ రూంలో స్నానం చేసి టౌనుకు వెళ్ళి ప్రయత్నిద్దామని శ్రీధర్ రెండడుగులు వేసాడు. కారు మేఘాల నుంచి తొంగి చూచిన చందమామ వలె బిలబిల లాడుతున్న జన ప్రవాహం నుంచి ఒక యువకుడు ముందుకు తోసుకువచ్చి "నమస్కారం శ్రీధర్ గారూ" అన్నాడు చిరునవ్వులోనే ఒక చిన్న పరిచయాన్ని ప్రవేశపెడుతూ. శ్రీధర్ ఆగిపోయాడు. ఆ యువకుడితో తనకు ఇంతకుముందు పరిచయం ఉన్నట్లుగానీ, కనీసం ఎక్కడైనా చూసినట్లుగానీ గుర్తు రాలేదు. సందిగ్ధావస్థలో ఉన్న శ్రీధర్ మానసిక స్థితి తెలుసున్న ఆ యువకుడు శ్రీధర్‌ను జన సమూహం నుంచి ఒక ప్రక్కకు తీసుకు వెళ్ళాడు.

కొంచెం తేరుకుని "క్షమించండి. మిమ్మల్ని

## దర్శకుడు ఇ.వి.వి. ఆలోచించాలి



తన సినిమాలో ఇకముందు హీరో శ్రీకాంత్‌కు వేషాలు వుండవని దర్శకుడు ఇ.వి.వి. సత్యనారాయణ చెప్పటం శ్రీకాంత్, సత్యనారాయణ అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. 'మా ఆవిడ మీద ఒట్టు మీ ఆవిడ చాలా మంచిది' సినిమా ఆశించిన రీతిలో ఆడక పోవడంతో ఇ.వి.వి. ఈ నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. ఉషాకిరణ్ మూవీస్ ద్వారా చిత్ర రంగ ప్రవేశం చేసిన శ్రీకాంత్ విలన్‌గా బిజీగా వుండగానే హీరో వేషాలు వేసి తనదంటూ ఒక శైలిని ఏర్పరచుకున్నాడు. పదేళ్ళ సినీ కెరీర్‌లో మంచి హిట్లే ఇచ్చాడు. శ్రీకాంత్‌తో సినిమాలు తీసేదిలేదని ప్రకటించిన ఇ.వి.వి. తన ఆలోచనను విరమించుకోవాలని పలువురు అభిమానులు కోరుతున్నారు.

-నందం రామారావు

గుర్తించ లేక పోయాను" అన్నాడు శ్రీధర్.

ఆ యువకుడు మెరుస్తున్న పెదవుల మీద చిరునవ్వులు కురిపిస్తూ "సహజమే" అన్నాడు.

యువకుడి చణుకుతో శ్రీధర్ మామూలు స్థితి నుంచి మారి, తార్కిక శాస్త్ర పరిచయాన్ని ఆచరణలోకి తేవలసి వచ్చింది.

ఆ యువకుని ధోరణి సమయస్ఫూర్తిని కోరుతున్నది. ఉదాసీనంగా చూస్తే, "గుర్తించలేకపోవడం మరపుకు చిహ్నమేగానీ, అపరాధం కాదనుకుంటాను" అన్నాడు శ్రీధర్. ఆ యువకుడు కొంచెం ఆవేశంతో శ్రీధర్ చేతిని తన చేతుల్లోకి తీసుకుని దీనంగా అన్నాడు. "మిమ్మల్ని తప్పు పట్టడం నా ఉద్దేశ్యం కాదు. మీరు నా అభిమాన రచయిత. నా వంటి వాళ్ళెందరికో మీరు తెలుసు. అభిమానులు ఆదర్శ వ్యక్తులను మరపురాని జ్ఞాపకాలుగా పెట్టుకుంటారు. కానీ ఆదర్శ వ్యక్తులకు అభిమానుల పరిచయం పొందాలన్న ఆకాంక్ష ఉన్నా అవకాశం ఉండదు. ఈ నగ్న సత్యాన్ని మీరు కాదన లేరనుకుంటాను."

శ్రీధర్ మరుక్షణంలో ఆ సంఘటన యొక్క అంతరంగ స్థితిని అవగాహన చేసుకున్నాడు. మంద స్మిత వదనంతో ఆ యువకుడిని ఆలింగనం చేసుకున్నాడు. యువకుడు శ్రీధర్‌ను తీసుకుని స్టేషను బయట ఉన్న కారు దగ్గరకు తీసుకు వెళ్ళాడు. శ్రీధర్, ఆ యువకుని కబుర్లతో కారు పందెం వేసినట్లు పరుగులు తీసింది.

కారులో జరిగిన సంభాషణంలో ఆ యువకుని ద్వారా శ్రీధర్ తెలుసుకున్న విషయాలివి. ఆ యువకుడు స్కూల్లో చదువుతున్న రోజుల్లోనే శ్రీధర్ 'కథానిక' ఒకటి ప్రబలంగా అతన్ని ఆకర్షించింది. ఆ పిమ్మట పుస్తకాలుగా అచ్చైన శ్రీధర్ నవలలు ఐదారు చదివాడు. శ్రీధర్ వ్రాసిన 'అభాగ్యులు' చదివాక రచయిత తనకు చాలా సన్నిహితుడయాడట. ఎప్పుడో ఒకసారి శ్రీధర్‌ను కలుసుకుని తన అభిమానాన్ని, అతని ఎడల తనకున్న గౌరవాన్ని తెలియజేయాలనుకున్నాడుట. శ్రీధర్ బి.ఎ. పరీక్షలకు వెళ్ళే ఏర్పాట్లు చేసుకున్నప్పుడే విజయవాడలోని ఒక ప్రైవేటు హాస్టలుకు తనకు నెలరోజులు ఒక రూము, భోజన వసతి కావాలని అర్జీస్తూ వ్రాసాడు. కానీ హాస్టల్ గదుల్లో పరిమితికి మించి విద్యార్థులు ఉండడంతో నిర్వాహకులకు శ్రీధర్ లేఖకు జవాబు వ్రాయవలసిన అవసరం కనిపించలేదు. అదే హాస్టలులో ఉంటూ ఈ యువకుడు బి.ఎ. ఫైనల్ చదువుతున్నాడు. రెండు రోజుల క్రింతం అత్యవసర సమావేశంలో తను హాస్టల్ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు ఫైల్స్‌లో శ్రీధర్ లేఖ చూసాడు. లేఖలోని విషయాలు తెలుసుకుని శ్రీధర్ లైఫ్ స్కెచ్, ఫోటో అంతకు ముందే చూసి ఉండడం వల్ల, అతను తన అభిమాన రచయితే నని నిశ్చయించుకుని, వసతులన్నీ ఇస్తామని ఒకటి రెండు రోజుల్లో శ్రీధర్‌కు లేఖ వ్రాద్దామనుకున్నాడు. ఈ రోజు మద్రాసు వెడుతున్న తన స్నేహితునికి వీడ్కోలివ్వడానికి స్టేషనుకు వచ్చి, తలవని తలంపుగా శ్రీధర్‌ను చూసి పోల్చుకుని పరిచయం చేసుకున్నాడు.

శ్రీధర్ ప్రయత్నం విని యువకుడు హర్షించాడు. ప్రోత్సహించాడు. శ్రీధర్ విజయానికి ఏకాగ్రత ప్రధానమని గుర్తించిన ఆ యువకుడు, కార్యదర్శిగా తనకు కేటాయించిన ప్రత్యేక గదిని కాళీ చేయించి శ్రీధర్‌కు ఇచ్చాడు. తను మరొక స్నేహితుని గదికి మారాడు. తన అభిమాన రచయితకు ప్రతిక్షణం విలువైనది కావడం వల్ల అతనికి అన్ని సౌకర్యాలు గది దగ్గరే సమకూరే ఏర్పాటు చేసాడు. కళాశాల నాలుగు గోడల మధ్య తను తెలుసుకున్న పాఠ్య విషయాలు కరిగించి కుదించి చెప్పడంలో శక్తి వంచన లేని ప్రయత్నం చేస్తానని శ్రీధర్‌కు మాట ఇచ్చాడు తలవని తలంపుగా జరిగిన ఈ సంఘటనతో శ్రీధర్ ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. ఏకాగ్రతకు విస్తృతమైన అవకాశం లభించింది. నిరాటంకంగా రోజుకు పదహారు గంటలైనా పుస్తకాల్లో మునిగి పోతున్నాడు. సాయంత్రం వేళల్లో మాత్రం యువకుడితో షికార్లు వెళ్ళి పాఠ్య విషయాలు చర్చించి మననం చేసుకునేవాడు. కాచు క్కూచున్న ఋతువు వచ్చింది. అనుమానించిన మేఘాలవలె చెదురుగా ఉన్న శ్రీధర్ ఆలోచనలు స్థిర సంకల్పంలో విలీనమయ్యాయి. పుష్కలమైన వర్షం వలె శ్రీధర్ మేధా సంపన్నత పరీక్ష పత్రాలపై ధారావాహినిగా ప్రవహించింది. చివరి పరీక్ష వ్రాసాక శ్రీధర్ ముఖం నవనవోన్మేషమైన కాంతులీనింది. వసతి గృహ మిత్రులంతా శ్రీధర్ పరీక్షా పత్రాలను ముట్టడించిన తీరు విని నివ్వెరపోయారు. అపజయం పొందని జ్యోతిష్కులవలె శ్రీధర్ విజయాన్ని రెట్టించి చెప్పుకున్నారు. వసతి గృహ మిత్రులకు తన అభిమాన పాఠకునికి ఆలింగనాలతో కృతజ్ఞత తెలుపుకుని వీడ్కోలు పొంది, బరువు తగ్గిన బెడ్డింగుతో శ్రీధర్ తిరుగు ప్రయాణమయ్యాడు.

★ ★ ★

లీవు అయిపోయిన మరుసటి రోజు శ్రీధర్ ఆఫీసుకు వెళ్ళాడు. ఆఫీసు వాతావరణం అంతా ముకుళించుకుని తనను వెక్కిరిస్తున్నట్లు కనిపించింది. భుజాల మీద చేతులు వేసుక తిరిగిన తోటి గుమాస్తాలు కూడా అంత ఆసక్తిగా తనతో మాట్లాడలేదు. బహుశా వాళ్ళందరికీ తెలివి తక్కువగా తోచిన పని తను చేసినందు వల్లనేమో.

ఆఫీసరు గడ్డం చేసుకున్న బ్లేడ్లు పొట్లం కట్టి మామూలుగానే జవాను తెచ్చాడు. పొట్లం విప్పి ఒక బ్లేడు తీసుకుని తాంబూలం సేవిస్తూ హెడ్ క్లార్కు గోళ్ళు తీసుకుంటున్నాడు. శ్రీధర్ తన రూం వంక రావడం దూరం నుంచే చూసి, చేస్తున్న పనిమాని ఒక లావుపాటి ఫైలు తీసుకుని పేజీలు త్రిప్పడం మొదలు పెట్టాడు, ఏవో ఎమర్జన్సీ సమాచారం కోసం వెతుకుతున్నట్లు నటిస్తూ. శ్రీధర్ దగ్గరగా వచ్చి నిలుచున్నాడు. హెడ్ క్లర్క్ స్వభావం, గుణగణాలు తెలిసికున్న శ్రీధర్ ఫైలు క్రింద

## కన్నడ 'బడ్జెట్టు పద్మనాభం'లో 'రవళి'



తమిళంలో హిట్ అయిన 'బడ్జెట్ పద్మనాభం' తెలుగులో ఎస్.వి. కృష్ణారెడ్డి దర్శకత్వంలో రిలీజ్ అయింది. తమిళ, తెలుగు వెర్షన్‌లో హీరోయిన్‌గా రమ్యకృష్ణ నటించింది. ఇప్పుడు ఇదే చిత్రాన్ని కన్నడంలో 'రవళి'ని హీరోయిన్‌గా పెట్టి తీయబోతున్నారు. తెలుగులో జగపతిబాబు పోషించిన పాత్రను కన్నడంలో జగ్గేష్ చేస్తున్నారు. తెలుగులో అంతంతమాత్రంగా ఆడుతున్న ఈ చిత్రం కన్నడంలో ఎలా ఆడుతుందో చూడాలి. కన్నడంలో 'రవళి'కి మంచి బ్రేక్ వస్తుందేమో చూడాలి.

-నందం రామారావు

నుంచి తొంగి చూస్తున్న సెకండు హాండు బ్లేడూ, గోళ్ళ ముక్కలు చూసి తనలో తాను నవ్వుకుని,

"గుడ్ మార్నింగ్ శాస్త్రిగారూ!" అన్నాడు.

శాస్త్రి ఊపిరి సలపడానిక్కూడా వీలు లేనంత తొందర పనిలో ఉన్నట్లు చిరాగ్గా తలపైకెత్తి, విలన్‌లా శ్రీధర్ మీద ఒక చిన్న విషపు నవ్వు విసిరి మళ్ళీ ఫైలులో తలముంచాడు. కావలసినప్పుడు తల మునిగేంత పనిని సృష్టించుకోవడంలో అక్కర లేనప్పుడు గంటల తరబడి బాతాఖానీలో లేడీ టైపిస్ట్ రూంలో, కాంటీన్‌లో గడపడంలో హెడ్ క్లర్కు శాస్త్రికి ప్రత్యేక నైపుణ్యం ఉంది.

శ్రీధర్ నిశ్శబ్దాన్ని భరించలేక "అటెండెన్స్ రిజిస్టరు ఎక్కడండీ?" అన్నాడు. శాస్త్రిని మాటల్లోకి దింపి ఆఫీసులో తను విన్న సమాచారం అతని నోటి గుండా చెప్పించాలని. హెడ్ క్లర్క్ ఫైలు చూసుకుంటూనే "నీ చేవ్రాలు ధరించే అర్హత ఆఫీసు హాజరు పట్టీకి పోయిందోయ్" అన్నాడు తుపాకీ మాటలు సవరించుకుని గుండ్లు లోపలకి సొరుగుతున్నట్లు.

విషయం ముందే విన్న శ్రీధర్ అన్నాడు "ఏం నేనంత అనర్హుడినా?"

"అర్హత ఉండబట్టే ఈ వాతావరణం నుంచి బయట పడ్డావు!"

శ్రీధర్‌కు ఒళ్ళు మండింది. ఇలాంటి కార్య నిర్వహణలో ఆఫీసరుతో బాటు హెడ్ క్లర్కుకు ఎంత వాటా ఉందో తనకు తెలుసు "ఏమో మీ జవాబే సంకుచితంగా కనిపిస్తున్నది" అన్నాడు.

సమయం కోసం ఎదురు చూస్తున్న శాస్త్రి ఫైలు మూసి డ్రాయరు లోంచి ఒక కాగితం తీసి శ్రీధర్ ముందుంచి "నా జవాబు సంకుచితంగా ఉన్నా, ఈ ఆర్డరు సువిశాలంగా ఉంది" అన్నాడు కసిగా నవ్వుతూ. శ్రీధర్ ముఖం కందగడ్డలా మారింది. ఆర్డరు చేతిలోకి తీసుకుని తొణక్కుండా "థాంక్స్ శాస్త్రిగారు" అని బయటపడ్డాడు.

★ ★ ★

ఆఫీసరు కడుపు మంట ఆచరణలోకి తెచ్చిన ఆర్డరు ప్రకారం శ్రీధర్, హత్యల్లాంటి ఘోరమైన నేరాలు తరచుగా జరిగే ఒక తాలుకా కేంద్రానికి ఆడిటరుగా నియమింపబడ్డాడు. ఆ వూరి ప్రజల మనస్తత్వం చాలా విచిత్రమైంది. ప్రభుత్వోగుల మానసిక స్థితిని బట్టి వాళ్ళు రాగ ద్వేషాలు చూపుతారు. అధికారం, హుందా చూపిన ఉద్యోగి వారి త్రినేత్రాగ్నికి గురి ఔతాడు. తమలో ఒకడుగా కలిసిపోయి "నొప్పించక తానొవ్వక తప్పించుకు తిరిగిన ఉద్యోగి కొత్త అల్లుడి గౌరవాన్ని ఆతిథ్యాలను పొందుతాడు. ఇలాంటి అడకత్తెరలో శ్రీధర్ విధి నిర్వహణ, కర్తవ్య పాలనా సాగించాలి.

ఆ ఊరిలో చార్జి తీసుకున్న కొత్తలో అక్కడి వాతావరణం ఇరుగ్గా తోచినా, స్వల్ప వ్యవధిలోనే శ్రీధర్ ఆ విచిత్రమైన వాతావరణాన్ని తనకు అనుకూలంగా, ఆహ్లాదకరంగా మలుచుకోగలిగాడు.

అక్కడి సహకార విక్రయ సంఘానికి కుల పెద్ద రామిరెడ్డి అధ్యక్షుడు. ఆ ఊరి ప్రజల సహజ స్వరూప స్వభావాలకు రామిరెడ్డి దర్పణం. రామిరెడ్డి దృఢకాయుడు, ఆయనది సువిశాల హృదయం, ఆయన మాటలలో, గలగల నవ్వే నవ్వులో నడకలో, నడవడిలో హుందాతనం తొణికిసలాడేది. దేనినీ ఆయన మనస్సుకు తీవ్రంగా తీసుకోడు. ఒక ఆచారమైనా, ఆలోచనైనా, అనుమానమైనా, అపవాదైనా చట్టున నమ్మి ఆచరించడు. కొలిములాంటి తన మనస్సులో కరిగించి తన సంస్కారంతో వన్నె చూసి విలువ కట్టే తీర్మానించుకునేవాడు. క్రియకు ప్రతి క్రియ ఆయన వేదాంతం. న్యాయానికి కంచుకోటలు కట్టి కాపలా కాయడం, అన్యాయాన్ని బలప్రయోగంతో బాహుటంగా అణచడం ఆయనను కవ్వించి నవ్వించే సరదా, ఇలాంటి విచిత్ర వ్యక్తితో చార్జి ఇవ్వబోతున్న ఆడిటరు శ్రీధర్‌ను పరిచయం చేసాడు.

రామిరెడ్డి శ్రీధర్‌తో కరచాలనం చేసి కౌగలించుకుని "మిస్టర్ శ్రీధర్ మీరు సాయంత్రం లోగా చార్జి తీసుకోండి. తప్పితే రాత్రికేమైనా ఈ ఊరి కథలు మీ చెవిన పడితే తెల్లారేలోగా చార్జి తీసుకోకుండా పరుగెత్తి పోగలవు?" అన్నాడు గల గల నవ్వుతూ.

రామిరెడ్డి హాస్య ధోరణికి, సమయస్ఫూర్తికి శ్రీధర్ చకితుడయ్యాడు. సందర్భాన్ని చటుక్కున అర్థం చేసుకుని "చిత్ర విచిత్రమైన కథలు, భయంకర గాథలు వ్రాయడం నా కెంతో సరదా. అలాంటప్పుడు ఊహల హద్దులలోనే, ఉన్న మీ ఊరి కథలు నా సాహిత్య పరిశోధనకు సహాయ పడవచ్చునుకుంటాను" అన్నాడు రామిరెడ్డి ప్రయోగాన్ని చిరునవ్వుతో తట్టుకుని.

కాఫీ గ్లాసులు అందించి చుట్టపొగ వదులుతూ, "ఐతే - ఘడికుడివే నోయ్. ఇంత ధైర్య సాహసాలు కలవాడివి చూడ్డానికి వచ్చిన యువకులందరనూ పిరికి వాళ్ళంటున్న మా సుజాతను లొంగదీసి పెళ్లి చేసుకోరాదుటోయ్?" అన్నాడు సహజంగా రెట్టించి నవ్వుతూ, సోఫాలో కూచుని కాఫీ చప్పరిస్తున్న శ్రీధర్, బాంబు శబ్దం విన్నవాడిలా ప్రక్కనున్న ఆడిటరు వంక చూసాడు. ఆ పాత ఆడిటరుకు ఇదంతా అలవాటే. శ్రీధర్ వంక చూసి వెక్కిరించినట్టు నవ్వాడు.

రామిరెడ్డి తరహాకు ఇది కొత్త కాదు. భారమైన విషయాన్ని బహు తేలిగ్గా చెబుతాడు. తనకు నచ్చింది చప్పున చేస్తాడు. తను చేసిన ఏ పనికైనా ఇతరులకు కష్టనష్టాలు కలిగినప్పుడు తప్ప విచారించడు. అందువల్లే శ్రీధర్‌ను చకిత పరిచిన రామిరెడ్డి ధోరణి పాత ఆడిటరుకు సర్వసాధారణంగా కనిపించింది.

రామిరెడ్డి ఆ ఇద్దరు ఉద్యోగులకు తన భవనంలో రాత్రి విందు ఏర్పాటు చేసాడు. ఆనాటి రామిరెడ్డిగారి సహచర్యానికి, సపరిచర్యకు, సహృదయతకు విస్తుపోయిన శ్రీధర్ భూమ్మీద కూడ స్వర్గాల్లాంటి చిన్న చిన్న లంకలుంటాయా అనుకున్నాడు.

## అంధురాలిగా 'లయ'



సహజత్వానికి దగ్గరగా నటించాలని అనేకమంది నటీనటులు ప్రయత్నిస్తుంటారు. ఆ కోవలోనే హీరోయిన్ 'లయ' అంధురాలి పాత్రలో నటించి మెప్పించాలని పెద్ద ప్రయత్నమే చేస్తోంది.

అంధుల మనో భావాలు, వారి ప్రవర్తన ఎలా వుంటుందో తెలుసుకోవడం కోసం ఇటీవల 'లయ' అంధులను కలుసుకుంది. ప్రేమించు చిత్రంలో 'లయ' అంధురాలిగా నటిస్తోంది. ఈ చిత్రంలో నటించినందుకు 'లయ'కు తప్పకుండా అవార్డు వస్తుందన్న నమ్మకంతో నిర్మాత డి. రామానాయుడు వున్నారు. రామానాయుడు ఆశలు వమ్ము కాకుడదని ఆశిద్దాం.

-నందం రామారావు

★ ★ ★

ఆ ఊరి కథలు శ్రీధర్‌ను కదలించలేక పోయాయి. ఘోరాలు, హత్యలూ జరిగినా, ఆ సంఘటనలకు సంబంధించిన వ్యక్తుల సామూహిక మనస్తత్వం, వక్రదృష్టే అందుకు కారణమని శ్రీధర్‌కు బోధపడింది. శ్రీధర్‌కు పరిచయమైన ప్రతి వ్యక్తి అతనికి సన్నిహితుడయ్యాడు. శ్రీధర్ ఆ ఊరిలో వినూత్న ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని పుంజుకున్నాడు. ఇందుకు కారణం శ్రీధర్‌లోని సమన్వయ దృష్టి, సంకల్పబలం కావచ్చు. రామిరెడ్డి తద్వారా సుజాతల పరిచయంతో శ్రీధర్‌కు కొత్త వెలుగులుకనిపించాయి.

రామిరెడ్డి చమత్కరించినట్లు శ్రీధర్ సుజాతను వంచలేకపోయాడు కాని, ఆమె లలిత హృదయంలో చాలా చోటు పంచుకున్నాడు. శ్రీధర్ హద్దులు దాటక పోయినా సుజాత మగువ మనసు మాట వినలేదు.

ఒకనాడు రామిరెడ్డి మేడ మీద గదిలో వాలు కుర్చీలో పడుకుని భగవద్గీత చదువుతూ, సుజాత కోసం కబురు పెట్టాడు. తండ్రిని ఏకాంతంలో కలుసుకోవాలని పథకాలు ఆలోచిస్తూ దక్షిణం ప్రక్క గదిలో లలిత సంగీతం వినిపిస్తున్న రేడియో చేరువగా కూచుని చదవకుండా పుస్తకం పేజీలు దొర్లిస్తున్న సుజాతకు ఈ పిలుపు మలయ మారుతంలా సోకింది. తండ్రి తన మనసును చదివాడా? అని చకితురాలైంది సుజాత. ముఖ కవళికలు మార్చుకుని మేడ మెట్లు ఎక్కింది. రామిరెడ్డి సుజాతను మందహాసంతో ఆహ్వానించి, గులాబీమాల మధ్యలో అందాలు చిందిస్తూ, ఆనందం ఒలక బోస్తున్నట్లు చూస్తున్న గోడ మీది సుజాత తల్లి చిత్రపటం వంక చూపాడు. కూతురును దగ్గరకు తీసుకుని "చూడమ్మా పుస్తకం చదువుకుంటుంటే మీ అమ్మ పిలిచి, మీ నుంచి వెళ్ళానని నన్ను అవమానిస్తారా. సుజాత వివాహం ఇప్పటికే అదను దాటింది. దీపావళికి సుజాతను అల్లుడి ప్రక్క చూసుకోవాలి. నా కోరిక మన్నించరా?'' అని అడిగిందమ్మ అన్నాడు, బుంగమూతి పెట్టి చిత్రంగా సుజాత కళ్ళలోకి చూస్తూ. చనిపోయిన లక్ష్మీదేవి లాంటి తల్లి మాట రాగానే చమర్చిన కళ్ళు ఒత్తుకుని తండ్రికి జవాబిచ్చింది సుజాత.

"నాలుగు రోజుల్లో దీపావళి పెట్టుకుని పెళ్ళేమిటి నాన్నా. మద్రాసులోని అన్నాయి ఫాక్టరీలో రెడీ మేడు అల్లుడ్ని తయారు చేశారా ఏమిటి?''

రామిరెడ్డి ఏ మార్పూ లేకుండా చిన్నగా నవ్వి అన్నాడు.

"ఇంకా నాకంత అవుసరం పట్టలేదమ్మా. మా సుజాతే వరున్ని వెతుక్కుంది?''

తండ్రి విసిరిన ఛణుకులో చిక్కుకుని సుజాత సిగ్గులో మునిగిపోయింది. తండ్రితో శ్రీధర్ విషయం తను చెప్పాలనుకున్న భారం, బాధ తగ్గినందుకు హృదయం సరసరాగాలాపనలతో నిండిపోయింది. "పో నాన్నా! ఇంత కొంటె వారు కనుకే కొంటె అల్లుడ్ని తెచ్చారు'' అని వెనుతిరిగి జింకలా పారిపోయింది.

తండ్రితో చదరంగం ఆడుతున్న సుజాత దూరం నుంచి శ్రీధర్ రావడం చూసి చిరునవ్వు నవ్వింది. ఈ రోజు శ్రీధర్ కళ్ళకు సుజాత ప్రశాంతమైన ఆకాశంలో ముసిముసి నవ్వులు నవ్వే చందమామలాగుంది. గులాబి రంగు వాయిల్ చీరతో ఆకు పచ్చ జాకెట్ వేసుకుని వదులుగ జడ వేసుకుని మురిసిపోతున్న సుజాత స్వప్న సుందరిలా ఉంది. విశాలమైన కేశాలు అందాన్ని వెదజల్లుతున్నట్లు నుదుటి మీద దోబూచు లాడుకుంటున్నాయి. ఆమె ముఖంలో అందం ఆనందంలో కలిసిపోయి కొత్త కాంతులీనుతున్నది. వాకిలి వరకు వచ్చిన శ్రీధర్ సుజాతను చూసి ఒక్క క్షణం ఉద్వేగం పొందాడు. పరిహసించే పాతలో ఎంత కొత్తదనముంది? అనుకున్నాడు.

శ్రీధర్ దగ్గరగా రావడం చూసి సుజాత లేచి నిలుచుంది. రామిరెడ్డి కళ్ళద్దాలు తీసి మేజా మీద ఉంచి ముఖం తుడుచుకుంటూ "సుజా! పారిపోకు. నీతో నాక్కొంచెం పనుంది'' అన్నాడు నవ్వకుండానే. సుజాత తండ్రి నుంచే సమయస్ఫూర్తిని పుణికి పుచ్చుకుంది.

"పారిపోయే వాళ్ళతో పనేమిటి నాన్నా'' అన్నది. శ్రీధర్ చదరంగం మీద ఉన్న దృష్టి అసలు రంగం మీదకు మరల్చి "పని ఉన్నది కాబట్టే నిన్ను పారిపోవద్దంటున్నారు'' అన్నాడు.

"మీరు వకాల్తా పుచ్చుకున్నారా''

"మీ నాన్నే ఇచ్చారు.''

చదరంగం పావులు సర్దుతున్న రామిరెడ్డి సమయం కనిపెట్టాడు. "నేనేం వకాల్తా ఇవ్వలేదు శ్రీధర్‌కు. ఒక చిన్న పని మాత్రం ఇవ్వాలి.'' సుజాత వంక తిరిగి "అమ్మాయ్ మేడ మీద గదిలో మేజా మీద ఉన్న కవరు పంపించమ్మా'' అన్నాడు. రామిరెడ్డి చుట్ట ముట్టించి నౌకరు తెచ్చిన కవరు శ్రీధర్‌కు అందించి, "ఈ శుభలేక అచ్చుకివ్వాలోయ్. మార్పులు, చేర్పులేమైనా అవసరమేమో నీవే చూసి పాస్ చేయాలి'' అన్నాడు.

శుభలేఖ అనగానే శ్రీధర్ మనసులో తుఫాన్ రేగింది. రామిరెడ్డిగారు ఎవరి పెళ్ళికి శుభలేఖ తయారు చేయడం? ఆయనకున్నది ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకు ఇంగ్లండు వెళ్ళి వచ్చి మద్రాసులో మోటారు కారు విడి భాగాలు తయారు చేసే పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. అతనికి మూడేళ్ళ క్రితమే పెళ్ళి అయింది. మరి సుజాత పెళ్ళా? పెరిగి పెద్దదై విరబూయనున్న తమ ప్రేమ లతను తెంపుకుని సుజాత మరొకరిని వివాహమాడుతుందా? రామిరెడ్డి సుజాత అభిమతానికి వ్యతిరేకంగా ఆలోచించగలడా? శ్రీధర్ మనసులోని అలజడిని అణచి పెట్టుకుని ముఖంలో మార్పేమిలేనట్లు, కవరు తెరిచి కాగితం

## రామేశ్వరం వెళ్లినా..!



కొంత మంది తారల జీవితాలు ఎప్పుడూ చర్చనీయాంశాలుగా మిగిలిపోతాయి. అలాంటివారిలో 'రవీనా' ఒకరు. ఆమెకు నేషనల్ అవార్డు 'దామన్' చిత్రానికి వచ్చిన సందర్భంగా ప్రెస్‌లోనూ, జ్యూరీ సభ్యుల్లోను వివాదం బయల్దేరింది. రవీనా జీవితం వడ్డించిన విస్తరికాదు కష్టపడి సంపాదించుకుంది. అంచ లంచెలుగా ఎదిగింది. అందుకే "నేనెప్పుడూ ఆశా వాదినే కాని..... అవకాశవాదిని కాను. నేను ఎవర్నీ చూసి ఏడవలేదు. నన్ను చూసి ఇంత మంది ఏడుస్తుంటే....ఈ ప్రపంచంలో ఇంత కుళ్ళుందా? అన్న ఆశ్చర్యం కలుగుతుంది. అయినా.... ఏం చేయగలం? కాలమే సమాధానం చెప్తుంది. నా బాధేవిటంటే రామేశ్వరం వెళ్ళినా శనేశ్వరం తప్పలేదని అంటుంటారు...'' ఇందుకేనేమో-! అంటోంది. -సాయిరాం

మడతలు విప్పాడు. ఆశ్చర్యం, ఆనందం, ఆవేశం, అభిమానం - శ్రీధర్ ముఖ కవళికలు రంగుల రాట్నంలా మారాయి. కాగితంలోని పెద్ద అక్షరాలు చెప్పిన శుభవార్త తను వరుడు, సుజాత వధువు. చెమర్చిన నేత్రాలతో శ్రీధర్ రామిరెడ్డికి ప్రణమిల్లి నమస్కరించాడు.

రామిరెడ్డి శ్రీధర్‌కు కాఫీ కప్పు అందించి, "శుభలేఖ ఎలా ఉందోయ్?" అన్నాడు. శ్రీధర్ కాఫీ చప్పరించి ముసి ముసి నవ్వులు నవ్వుతూ "గారడీలా ఉంది" అన్నాడు. రామిరెడ్డి చదరంగానికి పావులు సర్ది సుజాతను కేకవేసాడు, అల్లుడికి, కూతురికి పోటీ పెట్టి ఆనందించాలని.

★ ★ ★

శ్రీధర్ వివాహం ఎంత చిత్రంగా జరిగిపోయిందో అతని జీవిత పథంలో అలాంటి విచిత్రమైన మార్పులు వచ్చాయి. వివాహం కాగానే శ్రీధర్ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చాడు.

రామిరెడ్డిగారికి కూతురు, కొడుకు రెండు కళ్ళు. క్రమ దృష్టికి రెండు కళ్ళకూ సమాన ప్రాధాన్యత ఉన్నప్పుడు భేదాభిప్రాయానికి అవకాశమే లేదు. లక్షరూపాయల స్థిరాస్తిని రామిరెడ్డిగారు కూతురుఅల్లుళ్ళ పేరున జాయింట్‌గా వ్రాసాడు. మద్రాసులో కొడుకు నిర్వహిస్తున్న కంపెనీలో శ్రీధర్‌కు సమాన వాటా ఏర్పాటు చేసి, అక్కడే ఒక బంగళా మాట్లాడి కొత్త కాపురం పెట్టించాడు. ఇప్పుడు రామిరెడ్డిగారు తన జీవితం పరిపూర్ణ స్థితి పొందినట్లు ఆనందించి తేలిక పడ్డాడు.

మొదటి నుంచీ వ్యాపార ఆసక్తి పెంచుకున్న శ్రీధర్ ఆ వ్యాపార సంస్థ నిర్వహణలో బాగా సర్దుకుపోయాడు. బావా మరదులు కృష్ణార్జునుల్లా వ్యాపార రంగంలో పురోగమించారు.

ఆ రోజు మధ్యాహ్నం శ్రీధర్ తన ప్రత్యేక గదిలో కూచుని గత జీవితాన్ని నెమరువేస్తూ, వెలుగు పొందనున్న జీవితం అడుగున పోటీపడి పరుగులు తీసే కష్టసుఖాల విస్మయ కలయికను పరిశీలిస్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు. ఆఫీసు బాయ్ వచ్చి "సార్ సార్!" అని నాలుగుసార్లు పిలిచాకగాని శ్రీధర్ ఈ లోకంలోకి రాలేదు.

"మీ కోసం ఎవరో బీద ముసలాయన వచ్చాడు సార్" అన్నాడు.

శ్రీధర్ చకితుడయ్యాడు "నా కోసమా?"

"ఔను సార్"

శ్రీధర్ తల ఆడించాడు లోపలకు పంపమన్నట్లు.

కష్టాల కళ్ళెంలో చిక్కుకుని వయసు పెరిగిపోయిన వృద్ధుడొకడు లోపలకు వచ్చాడు. చిరిగిన కోటు, పెరిగిన గడ్డం, అరిగిన చెప్పులతో ఉన్న ఆ వ్యక్తిని శ్రీధర్ పోల్చుకోలేకపోయాడు.

దగ్గరకు వచ్చి "శ్రీధర్" అన్నాడు ఆ వ్యక్తి సిగ్గుతో కుమిలిపోతున్నట్లు కనుబొమలు చిట్లించి. రూపం మారినా, మారలేని గొంతువిని శ్రీధర్ ఆ ముసలాయనను గతి జీవితంలోని తన ఆఫీసరుగా పోల్చుకున్నాడు. ఉద్వేగంతో "మీరా రండి. ఏమిటిలా అయిపోయారు" అన్నాడు కుర్చీ చూపించి.

ఆయన కూర్చోలేదు. శ్రీధర్‌ను బాగా సమీపించి "అమర జీవులు పుస్తకంలో నీ చిరునామా చూసి క్షమాపణ కోరుకోవడానికి వచ్చాను నాయనా. నన్ను క్షమించు."

శ్రీధర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గతాన్ని మరిపించిన ప్రస్తుతం శ్రీధర్ మనస్సును కరిగించింది.

"ఉద్యోగ రీత్యా మీ ఆజ్ఞను ఆచరించనందుకు క్షమాపణ కోరవలసింది నేను."

"కాదు శ్రీధర్ నీకు నేను అన్యాయం చేసాను."

శ్రీధర్ ఉద్రేకంలో చెప్పుకుపోయాడు.

"మీ విధి నిర్వహణ మీరు చేసారు. ప్రభుత్వానికి మీరు చేసిన న్యాయం వల్ల నాకు అన్యాయం కలిగిందని భ్రాంతి పడ్డారు. ఆనాటి సంఘటన నాకు అమర సుఖాలను ప్రసాదించింది. నిమిత్త మాత్రులమైన మనం పర్యవసానాలకు బాధ్యుల మనుకోవడం భ్రమ మాత్రమే."


నోరు తెరుచుకుని శ్రీధర్ వంక చూస్తున్న ముసలాయనకు శ్రీధర్ మాటలకు బదులు చెప్పడానికి నోరాడలేదు. ఏదో అనిర్వచనీయమైన సంతృప్తితో ఆలోచనలో మునిగిపోయాడు.

"మీరెందుకిలా మారిపోయిందీ చెప్పలేదు సార్" అన్నాడు శ్రీధర్.

శ్రీధర్ బలవంతాన ముసలాయన కూచుని అన్నాడు "చెప్పడానికి సిగ్గు చేటుగా ఉన్నా నా గాథ వినడానికి, నా బాధ తెలుసుకోవడానికి నీవే అర్హుడవు నాయనా. హెడ్ క్లార్క్ శాస్త్రి చేసిన దురాగతాలకు, కాజేసిన ఆఫీసు డబ్బుకు బాధ్యుడనై, ఉద్యోగం పోగొట్టుకున్నాను. తప్పనిసరిగా మద్రాసులో ఉన్న నా కూతురి అండకు చేరాను. నేను వాళ్ళకెంత భారంగా వున్నదీ నా వేషమే సాక్ష్యం చెబుతుంది."

శ్రీధర్ డ్రా తెరిచి కరెన్సీ నోట్లు కవర్లో పెట్టి కవరు ముసలాయనకందిస్తూ "ఇది తీసుకుని మీకు కావలసిన దుస్తులు తీసుకుని మిగతా అవసరాలు తీర్చుకోండి. వారం పది రోజుల్లో ఎప్పుడైనా వచ్చి మా కంపెనీలో జాయిన్ కండి" అన్నాడు సహజ ధోరణిలో. ముసలాయన పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై వరమిచ్చినట్లు ఉక్కిరి బిక్కిరై శ్రీధర్‌ను కౌగలించుకుని "దైవత్వం నీలో పరిపక్వం పొందింది" అన్నాడు. శ్రీధర్ చిరునవ్వు నవ్వాడు. "మా కంపెనీలో సేల్సు మేనేజరు పదవి మీకోసమే కాచుకుని కూర్చున్నట్లుంది. ఎన్ని ప్రకటనలు వేసినా మాకు తగిన వ్యక్తి దొరకలేదు. నెలకు జీతం పదివేల రూపాయలు మాత్రమే సార్" శ్రీధర్ సమయస్ఫూర్తికి హాస్య ధోరణికి ముసలాయన గొల్లున నవ్వాడు. ❋

## రచయిత, గాయకుడు, సంగీత దర్శకుడు.



వాయిద్యాల హోరులో సాహిత్యం మరుగున పడిపోకూడదని చెప్పే సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ ప్రస్తుతం బిజీబిజీగా వున్నాడు. సంపంగి, అటాక్స్ చిత్రాలకు సంగీతం అందించిన కృష్ణ పాటలు ఆంధ్రాలో మారుమ్రోగుతున్నాయి. సంగీతంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి అవకాశాలు కోసం నిరీక్షించిన కృష్ణ కలలు ఫలించాయి. ప్రస్తుతం పది సినిమాలకు సంగీతం అందిస్తున్న కృష్ణ మంచి గాయకుడే కాకుండా మంచి గీత రచయిత కూడా. తను రాసిన పాటలకు తానే ట్యూన్స్ చేసుకుని తనే పాడటం ఓ గొప్పవరం. అరుదైన ఈ అవకాశాలను ఘంటాడి కృష్ణ సద్వినియోగం చేసుకోవాలి. తెలుగు తెరకు మరో మంచి యువకుడు రావడం హర్షణీయం.

-నందం రామారావు